క్లుప్తంగా

హుండీ ఆదాయం లెక్కింపు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పహాడీషరీఫ్: మామిడిపల్లి శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ హుండీని అధికారులు శనివారం లెక్కించారు. నాలుగు నెలలకు సంబంధించి భక్తులు వేసిన విరాళాలను దేవాదాయ శాఖ జిల్లా ఇన్‌స్పెక్టర్ ప్రణీత్, ఈవో మురళీ కృష్ణ, పాలక మండలి చైర్మన్ కొట్ల వెంకటేష్‌ల పర్యవేక్షణలో లెక్కించగా రూ.1,18,354లుగా తేలింది. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. సంక్రాంతికి ముగ్గుల పోటీలను కూడా నిర్వహిస్తామన్నారు. ఈ లెక్కింపులో కమిటీ సభ్యులు పద్మ శంకర్ గౌడ్, కృష్ణ, సహదేవ్, అశోక్ ముదిరాజ్, గ్రామ నాయకులు నరేందర్ గౌడ్, స్వామి, శేఖర్, వీరేందర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలి


పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సుజాతా నాయక్

హస్తినాపురం: విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ అన్నారు. డివిజన్ పరిధిలోని రోషన్‌దౌలా కాలనీలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆమె సందర్శించి పాఠశాలలోని వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించేందుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఇక్కడ చదువుకునే విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడంతో పాటు అన్ని రంగాల్లో రాణించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో రామచంద్రనాయక్, మమత, మల్లేశ్‌గౌడ్, రేణుక, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

చైతన్యపురి: గడ్డిఅన్నారం డివిజన్‌లోని న్యూ గడ్డి అన్నారం కాలనీలో ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి అన్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు శివగంగా థియేటర్ సమీపంలోని ఇరిగేషన్ శాఖ నాలా పక్కన ఉన్న స్థలంలో చేపట్టిన నిర్మాణాలను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ స్థలంలో పార్కు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు జీహెచ్‌ఎంసీ అధికారులను కోరారని, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం ఆ స్థలాన్ని కబ్జాదారులు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. కబ్జాదారులపై అధికారులు చర్యలు తీసుకోక పోతే కాలనీవాసులతో కలిసి ధర్నా చేస్తామని ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు.

ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ మేళాకు విశేష ఆదరణ

వనస్థలిపురం: చేనేత వస్త్రాలు, ఉత్పత్తులను ఆదరించాల్సిన అవసరం ఉందని, తద్వారా ఎందరికో ఉపాధి లభిస్తుందని ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా నిర్వాహకుడు అక్బర్‌అలీ అన్నారు. వనస్థలిపురంలోని హుడా ఓపెన్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ మేళాకు స్థానికుల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని అన్నారు. మేళాలో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్, లినెన్, కలంకారీ, బెంగాల్ కాటన్, లక్నో చికాన్, బనారస్ చీరలు, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజెస్, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ, జైపూర్ బెడ్‌షీట్స్, కొండపల్లి బొమ్మలు, బ్యాగులు, గాజులు, చెప్పులు తదితర ఉత్పత్తులు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయని ఆయన తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రత్యేక తగ్గింపు ఇస్తున్నామని, ఈ అవకాశం కొద్దిరోజులు మాత్రమే ఉంటుందని ఆయన తెలిపారు.

రైతు బజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 21, వంకాయ 35, బెండ 45, పచ్చిమిర్చి 45, కాకర 55, బీర 35, క్యాబేజీ 18, ఫ్రెంచిబీన్స్ 40, క్యారెట్ 37, దొండ 28-37, చిక్కుడు 23-45, గోకర 40, బీట్‌రూట్ 21, క్యాప్సికం 70, ఆలు 21-27, దోస 35, సొర 11, పొట్ల 18, ఉల్లిగడ్డ 24, చామగడ్డ 55. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

సేంద్రియ ఎరువులతో భూసారం పెంపు

- సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్
- రైతులకు అవగాహన కార్యక్రమం


రైతులకు అవగాహన కల్పిస్తున్న రత్నాకర్

షాబాద్: రైతులు సేంద్రియ ఎరువుల వాడకం తప్పనిసరిగా పాటించాలని సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ గొల్లపెల్లి రత్నాకర్ పేర్కొన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామంలో రైతులకు ఎరువుల వాడకం, నేల ఆరోగ్యంపై సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత కొంత కాలంగా భూసారం కాల క్రమేణా తగ్గిందన్నారు. ప్రస్తుతం భూమి పంటలు పండించే శక్తి కోల్పోయే స్థితికి చేరిందన్నారు. పశువుల ఎరువులు, ఇతర సేంద్రియ ఎరువులు వాడకపోవడంతో భూసారం దెబ్బతింటుదన్నారు. సేంద్రియ కర్బనం 1 శాతం కంటే తక్కువ ఉంటే పంటల ఎదుగుదల, దిగుబడులు ఆశించినంతగా ఉండవన్నారు. అలాంటి నేలల్లో పంట దిగుబడులు పెంచాలంటే రైతులు సేంద్రియ ఎరువుల వాడకం తప్పనిసరిగా చేయాలన్నారు. వాతావరణ వ్యత్యాసాల వల్ల పంట దిగుబడులు ఆశించినంతగా ఉండటం లేదన్నారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతుల ద్వారా కర్బనాన్ని పెంచవచ్చున్నారు. ముఖ్యంగా బాయోచర్, పచ్చిరొట్ట, పశువుల ఎరువు, పంట వ్యర్థాలు నేలలో కలియదున్నడంతో సారం పెరుగుతుందన్నారు. సుగుణమాల రైతు ఉత్పత్తి దారుల సంఘం చైర్మన్ లింగం మాట్లాడుతూ.. రైతులు భూసార పరీక్షించి ఏయే పోషకాలు ఎంత మోతాదులో ఉన్నాయో తెలుసుకొని తక్కువ ఉన్న పోషకాలు నేలకు అందిస్తే మంచి దిగుబడి పొందవచ్చాన్నారు. అడ్వాన్స్ పెస్టిసైడ్స్ కంపెనీ రీజినల్ సేల్స్ మేనేజర్ కృష్ణారావు మాట్లాడుతూ.. పైర్లకు పోషకాలు అందించడంలో సమతుల్యత పాటించకపోవడం వల్ల నేల ఆరోగ్యం, ఉత్పాదకత తగ్గిపోవడం జరుగుతుందన్నారు. అంతే కాక రైతులు పురుగులను, తెగుళ్లను, పోషక మూలకాల లోప లక్షణాలను గుర్తించడంలో సరైన అవగాహన లేక కృత్రిమ మందులను విచక్షణరహితంగా వాడటంతో పంటల్లో రసాయన అవశేషాలు ఉంటున్నాయన్నారు. మిత్ర జీవులు నశించి పోవడం, పర్యావరణ కాలుష్యం వంటివి వాటిల్లడం జరుగుతోందని అన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు యాదవరెడ్డి, అంజయ్య, గోపాల్‌రెడ్డి, శేఖరయ్య, కంపెనీ ప్రతినిధి సురేష్, గ్రామ రైతులు తదితరులున్నారు.

ముగిసిన ప్రజాపాలన

తుక్కుగూడలో 8,355 దరఖాస్తులు

తుక్కుగూడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఆరు గ్యారంటీల అమలు కోసం చేపట్టిన కార్యక్రమానికి తుక్కుగూడ మున్సిపాలిటీ వ్యాప్తంగా అనూహ్య స్పందన లభించింది. మున్సిపాలిటీ వ్యాప్తంగా 8,355 దరఖాస్తులు వచ్చాయి. ఈ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభించారు. ఆన్‌లైన్ చేయడంలో మున్సిపల్ సిబ్బంది నిమగ్నమయ్యారు. ప్రజాపాలన కింద వచ్చిన దరఖాస్తులను కలెక్టర్ ఆదేశాల మేరకు వార్డులు వారీగా ఆన్‌లైన్ నమోదు చేస్తున్నామని కమిషనర్ బి.వెంకట్రామ్ శనివారం తెలిపారు.

బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో 32,149

బడంగ్‌పేట్: ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తులు శనివారంతో ముగిశాయి. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆరు గ్యారంటీ పథకాల కోసం లబ్ధిదారులు క్యూ కట్టారు. ఫారంలో కొత్త రేషన్‌కార్డు కాలం లేకపోవడంతో వేల మంది తెల్లరేషన్ కార్డు కోసం దరఖాస్తులు చేసుకున్నారు. బడంగ్‌పేట్ పరిధిలో 32వేల 149 దరఖాస్తులు వచ్చినట్లు కార్పొరేషన్ మేనేజర్ నగేష్ తెలిపారు.


బడంగ్‌పేట్: చివరిరోజు దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థుల ప్రతిభ


ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శిస్తున్న చిన్నారులు

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని గాయత్రినగర్ మెగాసిటీ గ్రామర్ హైస్కూల్‌లో 'సంపూర్ణ విజ్ఞానం' పేరిట శనివారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా చిన్నారులు, విద్యార్థులు ఎక్స్‌పోలో స్వయంగా రూపొందించిన పలు అంశాలను ప్రదర్శించి తమ ప్రతిభను చాటుకున్నారు. కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్లు చల్లా కవిత, మద్ది సబిత, గౌరీ శంకర్, మీర్‌పేట సీఐ కిరణ్‌కుమార్‌లు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థుల ప్రదర్శనలను తిలకించి అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ కేవీఆర్.మూర్తి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీసేందుకే ప్రతి సంవత్సరం పాఠశాలలో సైన్స్ ఎక్స్‌పోను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు రోడ్డు ప్రమాదాలు, హెల్మెట్ ప్రాధాన్యంపై అవగాహన కల్పించి 300 హెల్మెట్‌లను తల్లిదండ్రులకు అందజేశారు.

ప్రిన్సిపాల్‌కి సన్మానం

ఏడేళ్ల నుంచి సెలవు తీసుకోకుండా విధుల నిర్వహణ


ప్రిన్సిపాల్ రమణమూర్తిని సన్మానిస్తున్న అధ్యాపకులు

మహేశ్వరం: ఏడు సంవత్సరాల నుంచి ఒక్క ప్రభుత్వ సెలవు తీసుకోకుండా పని చేస్తున్న మహేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్.రమణమూర్తిని శనివారం కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు సన్మానించారు. 1988లో ప్రభుత్వ పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా తన ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించి అనంతరం ప్రభుత్వ కళాశాల అధ్యాపకునిగా, ప్రిన్సిపాల్‌గా ఉద్యోగోన్నతి పొందారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ.. పని చేసిన ప్రతి చోట విద్యార్థుల సంఖ్యను పెంచి ఉత్తమ ఫలితాలు సాధిస్తూ వస్తున్నారని తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన పేద విద్యార్థులకు అనేక రకాలుగా ఆర్థిక, నైతిక సహకారం అందిస్తూ ముందుకెళ్తున్నారన్నారు. ప్రస్తుతం 61 సంవత్సరాల వయసులో కూడా ఒక్క ప్రభుత్వ సెలవు వాడుకోకపోవడం వృత్తి పట్ల తన నిబద్ధతను చాటుతున్నారన్నారు. 2022లో రమణమూర్తి సేవలను గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డుతో సత్కరించిందని తోటి అధ్యాపకులు గుర్తు చేశారు. అనంతరం అధ్యాపకులు, విద్యార్థులు ప్రిన్సిపాల్‌ను ఘనంగా సన్మానించి అభినందించారు.

చిన్నారులకు హెల్మెట్ల పంపిణీ

పహాడీషరీఫ్: పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు హెల్మెట్లు పంపిణీ చేయడం అభినందనీయమని జల్‌పల్లి మున్సిపాలిటీ 21వ వార్డు కౌన్సిలర్ షేక్ ఫమీదా అఫ్జల్ అన్నారు. వాదే ముస్తఫా బస్తీలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఆలిండియా హెడ్ ఇంజ్యూరీస్ ఫౌండేషన్, సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 102 మంది విద్యార్థులకు ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ.. చిన్నారులు ఇంటి నుంచి తల్లిదండ్రులతో కలిసి ద్విచక్రవాహనాలపై వచ్చే సమయంలో ఒక్కసారి కింద పడి గాయాలకు గురవుతుంటారన్నారు. హెల్మెట్ ధరించడంతో ప్రయాణ సమయంతో పాటు ఆటలాడుకునేటప్పుడు కూడా రక్షణగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎంలు రామానుజన్, మస్రత్, ఉపాధ్యాయులు అర్షియా, చైతన్య, అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.


హెల్మెట్లు ధరించిన విద్యార్థులతో నిర్వాహకులు

బీఆర్‌ఎస్ నాయకుల అసంతృప్తి


మాట్లాడుతున్న షర్ఫుద్దీన్, అంజద్ ఖాన్

పహాడీషరీఫ్: పార్టీ సమావేశాలకు తమను పిలవకుండా అవమానిస్తున్నారని జల్‌పల్లి మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు షర్ఫుద్దీన్, ఉపాధ్యక్షుడు మహ్మద్ అంజద్ ఖాన్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. 20 ఏళ్ల నుంచి పార్టీలో కొనసాగుతున్న తమ పట్ల గతంలో కూడా ఇలాగే వ్యవహరించారని.. ఒక్కోసారి పిలిచినా వేదికపై ప్రసంగించడానికి అవకాశం కల్పించడం లేదన్నారు. ఈ విషయమై గతంలోనే ఎమ్మెల్యే సబితారెడ్డి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం ఉండడం లేదన్నారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి జరిగిన సమావేశానికి తమకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని ప్రశ్నించారు. ఆత్మగౌరవం లేని చోట తాము పనిచేయలేమని, శనివారం ఎర్రకుంటలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో స్పష్టం చేశారు.

సీసీ, డ్రైనేజీ పనులు ప్రారంభం

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి 19వ డివిజన్ అంబేడ్కర్‌నగర్‌లో రూ.30 లక్షల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులను శనివారం స్థానిక కార్పొరేటర్ బైగళ్ల బాలమణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి సహకారంతో డివిజన్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. డివిజన్‌లోని అంబేడ్కర్ వెల్ఫేర్ భవనం, శ్రీగాయత్రినగర్ కాలనీ అసోసియేషన్ భవనాలను త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కందాళ బాబు, బైగళ్ల ఓంప్రకాశ్ పాల్గొన్నారు.


పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ బాలమణి

అనుమతి లేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

విద్యార్థి సంఘాల నాయకులు


సమావేశానికి హాజరైన విద్యార్థి సంఘాల నాయకులు

మలక్‌పేట: అధిక ఫీజులు వసూలు చేస్తూ, ప్రభుత్వ అనుమతులు లేకుండా నడిపిస్తున్న కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యార్థి సమితి(టీవీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు మంద రమేష్ మాదిగ అధ్యక్షతన శనివారం దిల్‌సుఖ్‌నగర్‌లో విద్యార్థి సంఘాల నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యా హక్కు, ఫీజుల నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విద్యా హక్కు చట్టం ప్రకారం కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల్లో 25 శాతం బడుగ, బలహీన వర్గాల విద్యార్థులకు ఉచితంగా విద్య అందించేలా చూడాలన్నారు. ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్న సంస్థలపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరారు. సమావేశంలో బీసీ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డేపల్లి రాకేష్, తెలంగాణ బహుజన కార్యాచరణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మర్రి రాజేందర్, తెలంగాణ స్టూడెంట్స్ జాక్ ప్రెసిడెంట్ అమనగల్ రాజు, తెలంగాణ స్టూడెంట్ యూనియన్ అధ్యక్షుడు సప్ప సతీష్, నాయకులు ఫణీంద్ర, చిప్పలపల్లి వెంకన్న, నక్క రమేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా పాఠశాల వార్షికోత్సవం


విద్యార్థుల నృత్య ప్రదర్శనలు

మీర్‌పేట: మీర్‌పేటలోని భాష్యం పాఠశాల వార్షికోత్సవ వేడుక శుక్రవారం రాత్రి విద్యార్థుల ఆటపాటల నడుమ ఉల్లాసంగా జరిగింది. శాస్త్రీయ నృత్యాలు, రామాయణం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు అలరింపజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ సైంటిస్ట్ యాదగిరి రామసాని, భాష్యం విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణ, సీఈఓ చైతన్య, జేడీఓ అంకమరావు, ప్రిన్సిపాల్ స్రవంతి, హెడ్ మిస్ట్రెస్ శృతి పాల్గొన్నారు.

శ్రీరాముని అక్షితల అందజేత


అక్షితలు అందుకుంటున్న వీరేందర్‌గౌడ్ కుటుంబ సభ్యులు

తుక్కుగూడ: అయోధ్యలో ఈనెల 22న భవ్యమైన శ్రీరామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా ప్రతి ఇంట్లో ఆ రోజు సాయంత్రం ఐదు దీపాలను వెలిగించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్ సూచించారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనగర్‌లోని ఆయన నివాసంలో అయోధ్య రామమందిర అక్షితలను, కరపత్రాలను నిర్వాహకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీరేందర్‌గౌడ్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్వామి కల్యాణానికి ఆహ్వానం


కేఎల్లార్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మహేశ్వరం: మండల పరిధిలోని అమీర్‌పేట్‌లో కొలువుదీరిన శ్రీవెంకటేశ్వరస్వామి వారి కల్యాణానికి హాజరు కావాలని మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని కలిసి ఆహ్వాన పత్రిక ఆలయ కమిటీ సభ్యులు శనివారం అందజేశారు. ఈ నెల 14న జరిగే కల్యాణ మహోత్సవం వైభవంగా జరుగుతుందన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రమేష్, కాంగ్రెస్ నాయకులు గొల్లూరు రాజు, ఇమ్మడి ప్రవీణ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు వారధిగా ఉండాలి

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

తుక్కుగూడ : కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్యవారధిగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ సూచించారు. శనివారం తుక్కుగూడ మున్సిపాలిటీకి చెందిన ఆ పార్టీ నాయకులు నగరంలోని ఆయన నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై ఫోకస్ చేసి వాటి పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. నియోజకవర్గంలోని అన్ని పార్టీ పదవులను రద్దు చేశామన్నారు. త్వరలో నూతన కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి జానకీరామ్, ధనంజయ్, రాజుకుమార్, రాజేందర్‌గౌడ్, యాదయ్య పాల్గొన్నారు.


కేఎల్లార్‌ను కలిసిన పార్టీ నాయకులు

ఇంటింటికీ అయోధ్య అక్షితలు

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని ఆయా కాలనీలలో శనివారం అయోధ్య రామాలయ అక్షితలను ఇంటింటికీ పంపిణీ చేశారు. జిల్లెలగూడకు చెందిన రంగారెడ్డి జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు సిద్దాల దశరథకు అక్షితలు, కరపత్రాలను అందజేశారు. అదే విధంగా సత్యసాయినగర్ కాలనీ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాలనీలో అక్షితలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉదయ్‌కుమార్, వినయ్, సిద్దాల శ్రీనివాస్, సిద్దాల జగదీష్, గాజుల మధు, శ్రీకాంత్, సదాశివరెడ్డి పాల్గొన్నారు.


అక్షితలు అందజేస్తున్న రామభక్తులు

సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన


సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న పారిజాతారెడ్డి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 18వ డివిజన్‌లోని సాయినగర్ కాలనీలో వేస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాతారెడ్డి పరిశీలించారు. రోడ్డు పనులు నాణ్యతగా చేపట్టాలని అధికారులు, గుత్తేదారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఈ జ్యోతి, ఏఈఈ వినీల్‌గౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి

రజక సంఘం భవన నిర్మాణానికి పూజలు

చేవెళ్ల: గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని చేవెళ్ల సర్పంచ్ బండారి శైలజారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డిలు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రజకనగర్‌కాలనీలో రజక సంఘానికి స్థలం కేటాయించి భవన నిర్మాణం పనులు చేపట్టారు. శనివారం భవనం స్లాబ్ పనులకు పూజ నిర్వహించి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శైలజ, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డిలు మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధిలో తమ వంతు కృషిని అందించేందుకు ఎప్పుడు తోడుంటామన్నారు. రజక సంఘం సభ్యులకు ఇచ్చిన హామీ ప్రకారం సంఘం భవనం కోసం తమ సొంత స్థలంలో 166 గజాలు కేటాయించామని, అందులోనే భవన నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ యాదయ్య, వార్డు సభ్యులు శ్రీనివాస్, హరికృష్ణ, మల్లారెడ్డి, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్, వినోద్‌కుమార్, కుమార్, రాములు, పెంటయ్య, మల్లేశ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.


స్లాబ్ పనులు ప్రారంభించిన సర్పంచ్ శైలజ, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి తదితరులు